క్లుప్తంగా

వైభవంగా లక్షతులసి పూజ



తులసి మాలలతో వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెహర్‌నగర్‌లోని వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం లక్షతులసి పూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో హోమం నిర్వహించారు. మల్లిపూడి అమర్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది. తులసి పూజ అనంతరం ఆలయ అర్చకులు తులసితో స్వామి వారిని ఎంతో అందంగా అలంకరించారు. రాత్రి సదస్యం ఎంతో వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా పీవీ రమణ, కె.సుశీల ఆధ్వర్యంలో ఘంటసాల సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ధరిత్రి రక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న అదబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: భావి తరాలకు భూ సహజ వనరులు అందించడానికి ధరిత్రి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పోలీసు శాఖ విశ్రాంత ఉద్యోగి దిలీప్ కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని పురస్కరించుకుని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అదబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. రవిశంకర్ పట్నాయక్, రెడ్నం రాజా, చంద్రరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వినియోగిద్దాం

మానవ మనుగడకు నీరు ప్రధానమైనదని పొదుపుగా వినియోగించుకోవాలని గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు పేర్కొన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆయన నీటి ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో అదబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గొడ్డటిపాలెంలో కూటమి ప్రచారం

కరప: మండలం గొడ్డటిపాలెంలో శుక్రవారం కాకినాడ రూరల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి పంతం నానాజీ ఎన్నికల ప్రచారం చేశారు. టీడీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీని కలుపుకొని వెళ్లాలి

బోట్‌క్లబ్: జిల్లాలో మిత్రపక్షమైన టీడీపీ, జనసేన నాయకులు బీజేపీని కలుపుకొని ముందుకు వెళ్లాలని అభ్యర్థుల ప్రచార రథాలపై బీజేపీ జెండా ఉండాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు చిట్నీడి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మిత్ర ధర్మాన్ని మూడు పార్టీలు అనుసరించాలని, అప్పుడే శత్రువును ఎదురించగలమన్నారు.

నేత్రదానం

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామానికి చెందిన ఆనాల ఛాయారత్నం(70) శుక్రవారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యుల అనుమతితో స్థానిక సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణ మాట్లాడి ఛాయారత్నం నేత్రాలను కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు దానం చేశారు. ఐ బ్యాంక్ సిబ్బంది రవి, నాని ఛాయారత్నం కార్నియాలను సేకరించారు. ఆమె కుటుంబ సభ్యులను ధూళిపూడి సత్యనారాయణ, సూర్యారావు, శుభ, విశ్వేశ్వరరావు, ప్రసాద్, నిమ్మకాయల సాయిరాం, ఆనాల పాపారావు, వుంగరాల వెంకటేశ్వరరావు అభినందించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు వేదుల శర్మ, సుధీర్, ఫణి శర్మ, చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. దేవస్థానం సూపరింటెండెంట్ ఐవీ రామారావుతో పాటు 25 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

చరిత్రాత్మకంగా ఏటిమొగ అభివృద్ధి



ఏటిమొగలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- మత్స్యకారుల సంపూర్ణ మద్దతు నాకే
- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- రెండో రోజూ ప్రజల్లో అదే అభిమానం



మత్స్యకార మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: చరిత్రలో ఎన్నడూ లేనంతగా మత్స్యకారులు అధికంగా నివసించే ఏటిమొగ ప్రాంతాన్ని అభివృద్ధి చేయగలిగానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 15, 16 డివిజన్ల పరిధిలోని ఏటిమొగ ప్రాంతంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలియజేస్తూ రానున్న ఎన్నికల్లో సీఎంగా వైఎస్ జగన్, ఎంపీగా చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఏటిమొగ ప్రాంతంలో రహదారులు, డ్రైనేజీలు, కమ్యూనిటీహాళ్లు, పార్కుల అభివృద్ధి, మత్స్యకారుల ఆరాధ్యదైవమైన గంగమ్మతల్లి ఆలయ నిర్మాణం చేపట్టగలిగానన్నారు. ఇచ్చిన, ఇవ్వని హామీలు కూడా అమలు చేసి చూపించానని, గడచిన 25, 30 సంవత్సరాల పరిధిలో ఏ రాజకీయ నాయకుడు చేయనంతగా ఏటిమొగను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. మరోసారి తనను గెలిపిస్తే సముద్ర వేటనే జీవనాధారంగా చేసుకున్న దుమ్ములపేట, ఏటిమొగ ప్రాంత మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈనాడు కథనాలపై మండిపాటు

ఏటిమొగ ప్రచారంలో తనను నిలదీశారంటూ ఈనాడు దినపత్రికలో వచ్చిన కథనంపై ఎమ్మెల్యే ద్వారంపూడి మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశ పూర్వకంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. తప్పుడు రాతలు రాయడం మాని ప్రజల్లోకి వచ్చి చూస్తే వాస్తవాలు అర్థమవుతాయన్నారు. సదరు మీడియా సంస్థలు ఎంత దుష్ప్రచారం చేసినా కొండబాబుపై తానే విజయం సాధిస్తానని ధీమాగా చెప్పారు.

వనమాడి అవినీతిని నిలదీస్తా

ఎన్నికల ప్రచారంలో తాను చేసిన అభివృద్ధిని సీఎం జగన్‌పాలనలో జరిగిన సంక్షేమాన్ని 2014–19 వరకు వనమాడి చేసిన అవినీతి అజెండాగా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తానని ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి స్పష్టం చేశారు. తన హయాంలో ఒక్క ఇల్లు కూడా కట్టని వ్యక్తి ప్రజల్లోకి ఎలా వెళ్లగలరని నిలదీశారు. 2014లో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిన చంద్రబాబు, పవన్, కొండబాబులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. ఎమ్మెల్యే వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ ఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు అంకాడి సత్తిబాబు, మత్స్యకార ప్రతినిధులు కాటాడి జానకిరామ్, భీమరాజు, చక్రవర్తి, సంగాని నందం, చవ్వాకుల రాంబాబుతో పాటు పెద్ద ఎత్తున మత్స్యకారులు పాల్గొన్నారు.

కోడ్ కొందరికేనా?



కరపలో యథాతథంగా టీడీపీ కార్యాలయం



కరపలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి వాల్‌పోస్టర్‌పై వైట్ పేపర్ అతికిస్తున్న ఎంసీసీ టీమ్

- విపక్షాల విషయంలో అధికారుల ఉదాసీనత
- వైఎస్సార్ సీపీ విషయంలో ఉరుకులు పరుగులతో తొలగింపులు

కరప: మండలంలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. అధికార పార్టీల పోస్టర్లు, విగ్రహాలు కనపడకుండా చేయడంలో ఉన్న శ్రద్ధ విపక్షాల పోస్టర్లు, హోర్డింగుల తొలగింపుపై చూపడం లేదు. కరప, పెనుగుదురు గ్రామాల్లో జేఎస్‌పీ తాత్కాలిక కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవడానికి దరఖాస్తు చేసి, అనుమతులు రాకుండానే ఆయా పార్టీల నాయకులు ప్రారంభోత్సవాలు చేసేశారు. పోలింగ్‌స్టేషన్లకు, పాఠశాలలకు, దేవాలయాలకు, మసీదులకు, చర్చిలకు 200 మీటర్ల దూరం తర్వాతనే ఏర్పాటు చేసుకోవలసి ఉన్నా నిర్ణీత దూరానికి లోపునే పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఈ కేంద్రం ఏర్పాటుపై ఈఆర్వో సైతం పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల లోపులో ఉన్నందున దూరంగా పెట్టుకోమన్నామని చెప్పారు. ఈ విషయమై అడిగితే తాజాగా ఆ కార్యాలయానికి ఎంపీడీఓ కె.అప్పారావు నోటీసులు ఇచ్చారు. అలాగే కరప మెయిన్ రోడ్డులో టీడీపీ కార్యాలయం పసుపురంగుతో, ఆ పార్టీల నాయకుల ఫొటోలతో ఉంది. కానీ కురసాల కన్నబాబు పార్కు బోర్డును మూయించి వేశారు. మారుమూల గోడపై వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ వాల్‌పోస్టల్‌పై వైట్ పేపర్ అతికించారు. ఇప్పటికైనా అధికారులు కోడ్‌అమలులో నిష్పక్షపాతంగా పనిచేయాలని మండలవాసులు కోరుకుంటున్నారు.

నోటీసులు జారీ చేశాం

నిబంధనలకు విరుద్ధంగా ప్రారంభించిన జేఎస్‌పీ కార్యాలయం, టీడీపీ కార్యాలయం రంగులు, ఫొటోలు తొలగించకపోవడంపై మండల ఎంసీసీ అధికారి, ఎంపీడీఓ కె.అప్పారావును వివరణ కోరగా ఆయా పార్టీలకు నోటీసులు జారీచేశామన్నారు. శుక్రవారం రాత్రికి తొలగించి, రంగులు, ఫొటోలు లేకుండా చేస్తామని జేఎస్‌పీ, టీడీపీ నాయకులు హామీ ఇచ్చారన్నారు. లేనిపక్షంలో శనివారం నిబంధనలకు లోబడి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఏ రాజకీయ పార్టీల వారివైనా ఫ్లెక్సీలు, హోర్డింగులు, వాల్‌పోస్టర్లు, స్టిక్కర్లు ఎక్కడ ఉన్నా తొలగిస్తున్నామన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి చేరికలే నిదర్శనం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



కరప మండలం వలసపాకల నుంచి చేరిన వారితో కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మరోసారి విజయం సాధిస్తుందని, ఇందుకు పార్టీలోకి వరస చేరికలే నిదర్శనమని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో కరప మండలం వలసపాకల నుంచి గురువారం రాత్రి భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. సర్పంచ్ వాసంశెట్టి రామారావు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి వాసంశెట్టి చిన వెంకటరమణ, మేడిశెట్టి నాగన్న, వనుం గణేష్, కేతా శ్రీను, అనుసూరి శ్రీరాములు, కేతా శ్రీనివాసరావు, వాసంశెట్టి ఆంజనేయులు తదితరులు సుమారు 50 మంది చేరారు. వీరందరికీ కన్నబాబు వైఎస్సార్ సీపీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. కాకినాడ రూరల్ మండలం వాకలపూడి గ్రామం బీసీ కాలనీకి చెందిన స్వామి, బి.శ్రీను, కె.నాని, జి.వీరబాబు, ఎ.రాజు తదితరులు 30మంది వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి చక్రధర్ ఆధ్వర్యలలో కురసాల సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరడంతో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కరప మండలం నుంచి వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో శుక్రవారం పలువురు చేరారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వేళంగి గ్రామానికి చెందిన పాలిక సూరిబాబు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి సుమారు 30 మంది చేరారు. అదే విధంగా కరప మండలంలోని కొరిపల్లె గ్రామం నుంచి సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నుంచి నురుకుర్తి పవన్‌కుమార్, డోకిచెర్ల ఉదయ్ భాస్కర్, నురుకుర్తి స్వామినాథ్, పంపన సతీష్‌కుమార్, దెయ్యాల రాజ్యలక్ష్మి, గుత్తుల రామాంజనేయులు తదితరులు పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలు వేసి స్వాగతించారు.



ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన వేళంగి ప్రజలు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- రూ.1.28 కోట్లతో కార్యాచరణ
- కమిషనర్ వెంకటరావు



కాకినాడ: రానున్న వేసవిలో తాగు నీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశించారు. శుక్రవారం ఈ మేరకు పుర పరిపాలనశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో సమీక్షించారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, సీడీఎంఏ కోటేశ్వరరావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం నీటి ఎద్దడి నివారణకు తీసుకోవలసిన చర్యలపై కమిషనర్ ఇక్కడి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.28 కోట్ల వ్యయంతో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ రూపొందించామన్నారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, అద్దె ప్రాతిపదికన జనరేటర్ల ఏర్పాటు, మోటార్లు మరమ్మతులు సహా సుమారు 20 పనులకు సంబంధించి ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. కాకినాడ ప్రజలకు నీటిని సరఫరా చేసే వేసవి జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు ఎంత ఉన్నాయి? సమృద్ధిగా ఉన్నాయా? లేదా? వంటి అంశాలను కమిషనర్ ఆరా తీశారు. అలాగే ప్రజల అవసరాల మేరకు ఆయా ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోను ప్రజలు మంచినీటి ఎద్దడి ఎదుర్కోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో స్మార్ట్‌సిటీ ఎస్‌ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవీ, డీఈ సుబ్బారావు, ఏఈలు ఎం.రమేష్‌బాబు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సునీల్, ద్వారంపూడిలను కలిసిన మాకినీడి





కాకినాడ ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే ద్వారంపూడిలను కలసిన శేషుకుమారి

కాకినాడ: వైఎస్సార్ సీపీలో చేరిన పిఠాపురం జనసేన నేత మాకినీడి శేషుకుమారి శుక్రవారం కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆమె వెంట మాజీ కార్పొరేటర్ నల్లబెల్లి సుజాత ఉన్నారు.

జనన, మరణ పత్రాల జారీకి కొత్త మార్గదర్శకాలు

- డీసీవో అధికారుల వెల్లడి
- కార్పొరేషన్‌లో విధానాలపై సంతృప్తి



కార్పొరేషన్‌లో ధ్రువపత్రాలను జారీ చేసే పద్ధతులను పరిశీలిస్తున్న డీసీవో అధికారుల బృందం

కాకినాడ: జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని కేంద్రానికి చెందిన డీసీఓ అధికారుల బృందం వెల్లడించింది. హైదరాబాద్‌లోని డైరెక్టర్ సెన్సెస్ ఆపరేషన్ (డీసీఓ) డిప్యూటీ రిజిస్ట్రార్ జనరల్ పీఎల్‌ఎన్‌సీ శిశుకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ సుప్రజ్ శుక్రవారం కాకినాడ నగరపాలక సంస్థలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగాన్ని సందర్శించారు. ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వీరితో సమావేశం అయ్యారు. ఆయా పత్రాల జారీకి సంబంధించి ప్రస్తుత అనుసరిస్తున్న మార్గదర్శకాలు, నిబంధనలు, ఆన్‌లైన్ విధానం, రికార్డుల భద్రత తదితర అంశాలపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ప్రతి మరణ ధ్రువీకరణలోనూ మరణానికి గల కారణాన్ని తప్పనిసరిగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. జనన, మరణాల సమాచారాన్ని అందించే సంబంధిత ఆసుపత్రి వర్గాలు, ఉద్యోగులకు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి సంబంధించి త్వరలోనే మరిన్ని కొత్త మార్గదర్శకాలు విడుదల కానున్నాయని వీటన్నింటినీ అధ్యయనం చేసి ఎటువంటి లోటుపాట్లు లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు.

నిబంధనల మేరకే రేషన్ పంపిణీ చేయాలి



రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లకు నియమావళిపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

కరప: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందును నిబంధనలకు అనుగుణంగా రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ వి.రామకోటేశ్వరరావు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల రేషన్‌డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన రేషన్ పంపిణీ, ఎన్నికల కోడ్ అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎండీయూ వాహనాలపైన, చౌకధరల దుకాణాలలో ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి ఫొటోలు లేకుండా చూసుకోవాలన్నారు. సదరు ఫొటోలపై తెలుపు లేదా ఆకుపచ్చ స్టిక్కర్లతో కవర్ చేయాలన్నారు. రాజకీయ, ఎన్నికల ప్రచారాలలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొనకూడదన్నారు. రేషన్ పంపిణీలో ఇచ్చే బెల్లం, రాగిపిండి తదితర నిత్యావసర వస్తువుల ప్యాకెట్లపై ఉండే సీఎం చిత్రంపైన స్టిక్కర్ అతికించాలన్నారు. ఎండీయూ వాహనాన్ని రేషన్ డోర్ డెలివరీకి మాత్రమే వినియోగించాలని, మరో పనికి ఉపయోగించకూడదదన్నారు. రేషన్‌షాపుల గోడలపై పోస్టర్లు కానీ, రాజకీయ నాయకుల చిత్రాలు కానీ ఉంటే వెంటనే తొలగించాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఆర్ఐ పేపకాయల మాచర్రావు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే పైఎత్తు

- చదరంగంలో రాణిస్తున్న జైప్రకాష్
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో ఎన్నో పతకాలు కైవసం
- ప్రపంచ స్థాయి పోటీలకు స్పాన్సరర్ల కోసం ఎదురుచూపు

కరప: మండలం కూరాడ గ్రామానికి చెందిన వనుం జైప్రకాష్ చదరంగంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణిస్తూ అనేక పతకాలు సాధించాడు. అండర్–10 విభాగంలో ఈ ఏడాది జార్జియా దేశంలోని బటోమి సిటీలో జూన్ 22వ తేదీ నుంచి జూలై 3వ తేదీ వరకు భారతదేశం తరపున ప్రపంచ కప్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు. అలాగే ఈ ఏడాది కజకిస్తాన్‌లో జరగనున్న అండర్–10 విభాగంలో ఆసియన్ చాంపియన్‌షిప్ లోనూ పాల్గొననున్నాడు. విదేశీ టోర్నీలలో పాల్గొనేందుకు, దానికి తగిన శిక్షణ పొందేందుకు సుమారుగా రూ.7 లక్షల వరకు అవసరం అవుతుంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రమే. తండ్రి వనుం వెంకటరమణ కాకినాడలోని మెరైన్ కానిస్టేబుల్, తల్లి బేబిస్వర్ణ గృహిణి. తమ కుమారుడు జైప్రకాష్ చదరంగంలో రాణిస్తున్నా, విదేశాలకు పంపే ఆర్థిక స్థోమత లేక ప్రోత్సాహకుల కోసం ఎదురు చూస్తున్నారు. దాతలు సహకరించాలని తండ్రి వెంకటరమణ తెలిపాడు.

జైప్రకాష్ విజయ పరంపర ఇదీ..

తొమ్మిదేళ్ల జైప్రకాశ్ కాకినాడలోని కేంద్రీయ విద్యాలయంలో 4వ తరగతి చదువుతున్నాడు. మూడేళ్లుగా కాకినాడ చదరంగం కోచ్ ప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. రోజుకు 5 గంటలపాటు చెస్‌లో సాధన చేస్తున్నాడు. 2023లో జార్ఖండ్‌స్టేట్ జంషెడ్‌పూర్‌లో జరిగిన అండర్–10 జాతీయస్థాయి పోటీలలో కాంస్య పతకం సాధించాడు. 202–23 సంవత్సరాల్లో రాజమహేంద్రవరం, కాకినాడలలో జరిగిన అండర్–8, అండర్–9, అండర్–10లో ఐదుసార్లు జిల్లాస్థాయి పోటీలలో మొదటి స్థానంలో నిలచి బహుమతులు, పతకాలు సాధించాడు. 2022లో విశాఖలో రాష్ట్రస్థాయి అండర్–10 పోటీలో ఎనిమిదో స్థానం, అదే ఏడాది రాజమహేంద్రవరంలో జరిగిన అండర్–8లో మూడో స్థానం, 2023లో గుంటూరు జరిగిన అండర్–9 పోటీలో రెండోస్థానం, భీమవరం, విజయవాడలలో జరిగిన పోటీలలో ప్రథమస్థానం కైవసం చేసుకున్నాడు. 2022లో విజయవాడలో జాతీయ స్థాయి అండర్–8 పోటీల్లో 14వ స్థానం, అండర్–9 తమిళనాడులోని హోసూరులో జరిగిన పోటీలో పదోస్థానంలో, జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో జరిగిన అండర్–9 పోటీల్లో తృతీయస్థానంలో నిలిచి బహుమతులు, పతకాలు సాధించాడు. ప్రోత్సాహకులు సాయం చేస్తే అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తానంటున్నాడు జైప్రకాష్.



చదరంగంలో సాధించిన పతకాలు, సర్టిఫికెట్లతో జైప్రకాష్

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి

పిఠాపురం: గ్రామాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీడీఓ వెంకటనారాయణ తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్త మూలపేటలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ మండలంలో 70 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో అతి సమస్యాత్మక కేంద్రాలు 22 ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఉప్పాడ, కొత్తమూలపేట, కుతుకుడుమిల్లి, అమీనాబాదు గ్రామాలతో పాటు పలు గ్రామాలపై మరింత దృష్టి సారించినట్టు తెలిపారు. పూర్తిస్థాయిలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పొన్న వాహనంపై గ్రామోత్సవం

పిఠాపురం: మండలంలోని మూలపేటలో వేంచేసిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామి వార్ల దివ్యకల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివార్లకు పొన్న వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. తొలుత పండితులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం రథోత్సవాన్ని పురస్కరించుకుని కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, బంగారు, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు.

వైభవంగా ఊంజల్ సేవ

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారి ఊంజల్ సేవ కనుల వైకుంఠంగా జరిగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.